# రాజకీయాలు

శ్రీ కొడవగంటి కుటుంబరావు




అనగా అనగా ఒక పెద్ద రాజ్యం. "రాజ్యం" అని అంటూన్నానే కాని, దానికి రాజంటూ ఎవడూ లేడు. అప్పటికి రాజులే లేరు; అప్పటికివర్ణాలూ లేవు. అయితే ఆ ప్రదేశంలో జనం కలిసి నివసించటానికి కారణం ఏమిటంటే, అక్కడ వెలసిన ఒకానొక దేవత. ఆరోజుల్లో మనుష్యులు అరణ్యమృగాలతో ఏవిధంగాకలిసి ఉండేవాళ్ళో, ఆవిధంగానే దేవతలు వాళ్ళతో కలిసిఉండేవాళ్ళు. ఇప్పుడు మనిషి ప్రవేశించటానికి వీల్లేని అరణ్యాల్లో మృగాలు మనుష్యులు లేరని నమ్మినట్టే, దేవతల చేత బహిష్కరించబడిన మనుష్యులు దేవతలను నిరాకరించటంలో ఆశ్చర్యం లేదు!

ఆ దేవత ఒకానొక కోయవాడికి ప్రత్యక్షమై తనకు దేవాలయం కట్టించి తన్ను దర్శిస్తూంటే అజ్ఞానఫలితాలైన పాపాలూ, పాపఫలితాలైన రోగాలూ మనుష్యులకు లేకుండా చేస్తానని చెప్పింది. ఆరోజుల్లో మనుష్యులకు ఆహార నిద్రా మైథునాలే వ్యాపారాలు. వాళ్ళకు ప్రకృతే భయహేతువు. ఆ కోయవాడు స్వయంగా రాళ్లు పేర్చి తన సాక్షాత్కారానికి గుహ ఒకటి నిర్మించాడు. వేలకొద్దీ జనం ఆగుహాముందు సాష్టాంగపడి తమరోగాలు పోగొట్టుకున్నారు. దీర్ఘ జాడ్యాలున్నవాళ్ళు ఆ ప్రాంత్యంలో ఇల్లు కట్టుకుని ఉండిపోవటం మొదలుపెట్టారు. ఆవిధంగా మన దృష్టిలో అనుమానాస్పదమైన ఒక దేవతామూర్తి ఇసక రేణువుల్లే ఉన్న మనుష్యులను దగ్గరికిచేర్చి గట్టిరాయల్లే చేసేసింది.

అక్కడ చేరినవారిలో జాడ్యమనేది లేకుండా పోయిందని నేను చెప్పలేను. తరువాత రెండువేల సంవత్సరాలకు ఒక శాస్త్రజ్ఞుడు, జాడ్యాలుతగ్గకపోగా అంటువ్యాధులు మరీ ప్రబలినవని నిరూపించాడు. అది కావచ్చు, కాకపోవచ్చు. మనకు కావాలిసిందేమిటంటే జనానికి రోగాలను చూస్తే భయం పోయింది. ఆంతకుపూర్వం ఎవరిగో ల వాళ్లది. ఇప్పుడు ప్రతివాడిలోనూ మిగిలినవాళ్ళకు స్నేహభావం ఏర్పడ్డది. ఈసమయంలో ఒక మేధావి అందరిదృష్టిని ఆకర్షించాడు. "మనమంతా సంఘం!" అన్నాడతను—ఆవేశంతో. "మన సంఘం! నా పొరుగు పెద్దమనిషి కష్టాల్లో నేను నాకష్టాలు మరిచిపోతాను. ఇది పవిత్రం, శాశ్వతం. మన దేవీ స్వరూపం!"

అందరూ నోళ్ళు తెరుచుకుని విన్నారు. "మనం సంఘం" ఆమాట కార్చిచ్చల్లే పాకింది. ఏఇద్దరు కలుసుకున్నా ఈమాట రహస్యంగా చెప్పుకోబడేది. చిత్రమేమిటంటే, ఆ మాట సంభాషణలోకి వచ్చినతరవాత ఒకరిని చూస్తే ఒకరికి ప్రేమ జాస్తయింది. ఆ మేధావే సంఘధర్మాలు పద్యరూపకంగా రాసేశాడు. అవి అందరూ వర్ణించారు. ఆ ధర్మాలందరూ పాటించారు. ఇప్పటి న్యాయశాస్త్రాలల్లే అవి అతిక్రమించబడటానికి ఉద్దేశించబడి తగిన శిక్షలతో సహా చెప్పబడలేదు. అందుచేత ఆ ధర్మశాస్త్రం ఎక్కువదని ఒక్కనాటి కసను. అప్పటివాళ్ల మెదడు ఎంత చిన్నదంటే, వాళ్ళకు 40 అడుగులగోడ ఎగిరిదూకటం ఎంత కష్టమో ఆధర్మాలకు విరుద్ధంగా చరించటం అంతకష్టం. అదే కృతయుగమని మనవాళ్ళు మన నోరూరిస్తే లాభం లేదు.

కాని ఈవిధంగా ఎంతకాలమో వెళ్లలేదు. ధర్మం అతిక్రమించబడటం మొదలుపెట్టింది. అంతకంతకూ అతిక్రమణ



లెక్కువకావటం మొదలుపెట్టినై. అందులో ఎక్కువభాగం శిక్షార్హమైన అతిక్రమణలు కావు. చాలా లోపం, మన స్తత్వం గుర్తెరక్కుండా రాసినశాస్త్రంలో ఉంది. ఆ శాస్త్రంరాయబడ్డ వందసంవత్సరాలకు దేశంలో ఆశాస్త్ర కారుడికంటె తెలివిగలవాళ్ళు కనీసం రెండువందలమంది ఉన్నారు. వాళ్ళు శాస్త్రాన్ని గౌరవించకపోవటంలో ఆశ్చర్యంలేదు. కాని వాళ్ల ఆసరా చూసుకుని మరో నాలుగైదువందల దుడుకుపిండాలు అనవసరమైన అతిక్రమణ ప్రారంభించారు. ఇంకా ఆశాస్త్రాన్ని పాలిస్తున్న వేలజనం ఏమవుతార్ను?య్నాన

...వ్యవస్థ జరగింది. శాస్త్రాన్ని పాటించాలిసిందేనని ...తా ఒప్పుకున్నారు. కొందరు మేధావులు శాస్త్రం అసంగతంగా ఉందన్నారు. అయితే క్రొత్తశాస్త్రం రాయగలరా అని ప్రశ్నవచ్చింది. అటువంటి పుస్తకమే మళ్లీ రాయాలంటే అది రాసినవాడికి రెట్టింపు తెలివికావాలి! మావల్ల కాదు. మేం సంఘంయొక్క ఏకత్వంకోసం శాస్త్రాన్ని పాటిస్తాం. మరీ తప్పులుగావున్న నియమాలు సంస్కరిద్దాం. ప్రతి అతిక్రమణకూ పెద్దశిక్ష పెడదాం. కుళ్ళిపోయినఅంగాన్ని ఖండించటంయొక్క ఆవశ్యకత అందరికీ తెలుసు!

ఆశాస్త్రం అమల్లోఉండేటట్టు చేసే బాధ్యత ఆకాలపు మేధావులమీద పడ్డది! వాళ్ళు మొదట బ్రాహ్మణులు! అది మొదటిరాజకీయం.

తప్పులుచేసినవాళ్ళను శిక్షించటం చాలా కష్టమైంది. తగినకోపంలేకుండా ప్రాణాలుతియ్యటం అలవాటులేనిపని. అందువల్ల ఇది మామూలు హత్యకింద గణించబడక, ఈ హత్యయొక్కఫలితం ఆయొక్కదేవతకు అర్పితం చేశా



రు. ఈమాట విన్నతరవాత ఒకానొకడు "ఇట్లా దేవత పేరుపెట్టి చేసేహత్యలకన్న కోపంతో పొడవటమే చాలా మంచిదేమో!" అన్నట్టూ, వాణ్ణి మిగిలినవాళ్లు అమాంతంగా కొండమీదికి తీసికెళ్ళి కిందికి విసిరిపారేసినట్టూ తెలుస్తుంది.

ఆ బ్రాహ్మణరాజకీయం ఆట్టే జయప్రదమైనట్టు కూడా కనిపించదు. జనం స్వతంత్రంగా ఆలోచించుకోవటం మొదలుపెట్టినకొద్దీ చిక్కులు జాస్తయినై. కొంతమంది బలశాలులు శిక్షించబడటాని కొప్పుకోక తిరగబడి బ్రాహ్మలను చితకపొడవటం మొదలు పెట్టారు. ఆ తరవాత రోజులు గడుస్తున్నకొద్దీ చెయ్యాలిసిన హత్యలు ఎక్కువైనై. బ్రాహ్మలంతా ఒక నిట్టూర్పువిడిచి ఈ న్యాయశాస్త్రం బహుక్రూరంగా ఉందన్నారు. సంఘం ఆమాటకు ఒప్పుకునే స్థితిలోలేదు. సంఘంలో ఉన్న బలశాలులంతా లేచారు. "ఓబ్రాహ్మలారా! మీరు బుద్ధి ప్రసాదించబడ్డది. మీరు శాస్త్రాలు చెయ్యండి. మేం వాటిని అమలులో పెడతాం! శిక్షించటం మీకు చాతకాదు!" ఆమాటకు సంఘం కరతాళధ్వనులు చేసింది!

రాజులొచ్చారు; రెండోరకం రాజకీయంవచ్చింది. పాపం పెరిగింది, వెనకటిరోజులిప్పుడు లేవన్నారు వృద్ధులు.

శాస్త్రాలు చదివి ఆప్రకారం న్యాయాన్యాయ విచారణ చెయ్యటం మొదలుపెట్టారు రాజులు. ఈరాజులలో పోటీలుపడి పోటీలు కలహాలుగా మారి ఒకరి తలకాయలు ఒకరు పగలగొట్టుకోటం మొదలుపెట్టారు. ఈ సందడిలో అన్యాయాన్ని శిక్షించటం వెనకపడ్డది. అట్లా వెనకపడకుండా ఉండేటందుకు రాజాంగం ఒకటి ఏర్పాటు చేశారుబ్రాహ్మలే. ఒక్కడెన్నిపనులు చేస్తాడు? రాజు తరఫున కొందర్ని ఏర్పాటుచేశారు. ఇంతమంది రాజులలో ప్రజలదృష్టి ఏఒకడి మీదికో పోవటం మొదలు పెట్టింది. కొందరు పెద్దలు మానవమన స్తత్వం కనుక్కున్నవారై, ఒకడే రాజుండాలన్నారు. ఒకడే రాజైనతరవాత న్యాయమో అన్యాయమో దేశానికి కొంత శాంతికలిగింది. రాజుకింద ఎంతమంది నౌకర్లయినారంటే-రాజు కెట్లాపొద్దు బుచ్చాలో తెలీలేదు. రాజు భోగలాలసుడు కావటం మొదలుపెట్టాడు.

బ్రాహ్మలను తలుచుకునే వాళ్ళు లేరు. జనాన్ని ఆకర్షించటానికో ఉపాయం చేశారు; దేవత సాక్షా

త్కరించిన రోజులలో ప్రతి కవిగాడూ ఆదేవిని కీర్తించిన పద్యాలు మొదలైనవన్నీ పోగుచేసి స్వరయుక్తంగా బిగ్గరగా పాడటం మొదలు పెట్టాడు; "ఇవి బ్రహ్మనోట్లోనించి వచ్చినై! ఇవి శాశ్వతం!" అన్నారు. రాజులు నిర్ఘాంతపోయినారు. "మీరు తెలివిగలవాళ్ళు. మాకూ రోజూ మీసలహావుంటే ప్రజలు సుఖపడేవారు. మీరు మాకు మంత్రాంగం చెయ్యాలి" అన్నారు రాజులు. "మేము రాము!" అన్నారు బ్రాహ్మలు. కొంతమంది రాజుల్ని సమీపించి "మాకభ్యంతరంలేదు! మమ్మల్ని మంత్రాంగానికుంచుకోండి! మీకు శుభమగుగాక!" అన్నారు.

కాలశకటం కుదుపులేకుండా వెళ్లిపోవటం మొదలుపెట్టింది. కొన్నివందల సంవత్సరాలు గడిచినై.

"మంత్రీ! నాకు కొన్నిలక్షలు బంగారపునాణ్యాలు కావాలి! ఎవరిస్తారు?" అన్నాడొకరాజు మంత్రితో.

"మీరీవిధంగా అప్పుచెయ్యటం మంచిదికాదు. మహాప్రభూ! ఇప్పటికే మీరాజ్యం మీదికాదు. మీపరిపాలనకిందవున్న ప్రతివస్తువునూ కొనగలద్రవ్యం మీరు కోమట్లదగ్గిర్నించి అప్పుతెచ్చారు! ఆలోచించండి!" అన్నాడు మంత్రి. రాజు మూర్ఛించాడు.

దేశంయొక్క నాగరికత ఏవిధంగా వ్యాపారం మీద ఆధారపడుతూవస్తున్నదీ రాజు గుర్తించలేదు. రాజు పన్నులు వసూళ్లుచెయ్యటం దుర్ఘటంగాఉంది. వ్యాపారంచేసి జనంచేత మంచి వాడనిపించుకుంటూ రాజు ఆదాయానికి పదిరెట్లూ ఇరవైరెట్లూ సంపాదించాడు విశ్వేశ్వరగుప్త.

లోకానికి తెలిసిపోయింది-రాజు రాజుకాడు విశ్వేశ్వరగుప్త రాజుకాని అని! ఒకరోజు గుప్త రాజుగారింటికి వచ్చాడు. ఆరగంటసేపు పిద్దరూ సంభాషించారు.

"మీరు నాకిచ్చిన డబ్బు మీకు నేనిచ్చాను. అది నాదా? అన్నాడు గుప్త తియ్యగా నవ్వుతూ, మీకింకా ఇస్తూంటాను-ఒక్క ఉపకారంచేస్తే. మీమంత్రిగారు ఏర్పరిచే చట్టాలు-నామాటా, నాసౌఖ్యం అట్లా వుంచండి! ప్రజలకు చాలా బాధగా వుంటున్నై. నావస్తువులు నేను వందమైళ్లు పంపించేటప్పటికి ఖర్చులుతగిలి జనం బాధపడుతున్నారు. నాకు మీరు మంత్రిత్వమిస్తే ఇక్కడిసరుకులకన్న నాసరుకులు చవకచెయ్యగలను. జనానిక్కావలసిందేమిటి? మరోమాట ఈ మీ ముఖ్యపట్టణం నాకమ్మేసెయ్యండి. మరామ్మతులూ, దీపాలూ, వీధులూ నేనే చూసుకుంటాను. భృత్యుణ్ణి!" అన్నాడు. రాజు దర్జాగా నీకడ్డమేమిటి అన్నట్టుగా చెయ్యి ఊపేశాడు.

"చిత్తం! ఎటుపోయి ఎటొచ్చినా మంచిది, ఈగుర్తుపెట్టిన చోట సంతకం చెయ్యండి...మరిచిపోయినాను చెప్పటం! మీకెందుకు శ్రమ? సైన్యానిక్కూడా నేనే—"

"ఊఁ!" అన్నాడు రాజుగారు "ఒరే! బుడ్డి!"

"మీ సెలవైతే... రెండు బుడ్లు!"

రాజుగారు గుప్తభుజంతట్టి నవ్వుతూ "సరసుడివి!" అన్నాడు.

అది మూడోరకం రాజకీయం. ఈరాజకీయంలో నాగరికత మేఘస్సును మించి నడిచింది. న...

అందుకనే నాలుగోరకం త్వరలో అమల్లో... ది! దేశం నానాక్షోభగా వుంది. ఒక రైలు నడవటంలేదు. ఒకఫ్యాక్టరీ పనిచెయ్యటంలేదు. అన్నివీధులూ నిర్మానుష్యంగా ఉన్నై. పెద్దవీధుల్లో శవాలు గుట్టలు గుట్టలుగా పడేసిఉన్నై. ఆ వేడిఎండలో నెత్తురుమడుగులు కళ్ళు తిరిగేటట్టున్నై.

చౌకులో ఉపన్యాసం. అనేక వేలమంది గుమిగూడి వింటున్నారు. కంటినిండా మొహంనిండా నెత్తురుమరకలుగల మనిషిచేతులో ఒక పిస్తోలు పట్టుకుని అరుస్తున్నాడు. "భగవద్గీత! సర్వసమత్వం! మనంచేసినవి హత్యలు కావు! శపథంచెయ్యండి! శపథంచెయ్యండి! మన జీవితాలు సంఘాన్ని సేవించటమే మనపని సంఘసేవ! సంఘసేవకూ జై! మనం ఇవాళ అరికట్టిన మనుష్యులు దుర్మార్గులు, సంఘానికి వేరుపురుగులు, మననెత్తురు పీల్చినారు! మనం వాళ్ళనెత్తురు ఒక్కచుక్కకూడా ... లేదు. సాలీళ్ళు! జలగలు-"

ఒకకుర్రవాడు కళ్ళజోడుపెట్టుకని లేచాడు.

"వాళ్ళు దుర్మార్గులుకారు...అనండి ఒప్పుకుంటాను. దుర్మార్గానికి అవసరమైన తెలివి వాళ్లకులేదు. మనం ఇవాళ ఇంతమంది అమాయకులను చంపటంలో చాలా అనవసరమైన శ్రమపడ్డామని నామతం-" "ధాం" ఆకుర్రవాడు కిందపడి కదలేదు. కొంచెంసేపు అంతా నిశ్శబ్దం. ఏమూలనుంచో ఏడుపు వినపడ్డది. ఆకుర్రవానికి కొందరు ప్రాణమిత్రులున్నారు. ఇంకోమూలనించి మరో పిస్తోలుపేలింది. ఉపన్యాసం ఇస్తున్నమనిషి లేడు. భయంకరమైన పెడబొబ్బ వినపడ్డది. వందపిస్తోళ్ళు ఒక్కసారి మోగినంత శబ్దమైంది. పొగలో ఏమీ కనపడకుండా పోయింది. సాయంత్రం మూడుగంటలకు అంతా నిశ్శబ్దం. అన్నిశరీరాలూ నేలను కరుచుకున్నై. మెల్లిగా ఒకమనిషి

తలఎత్తాడు. "ఢాం!" వెంటనే ఇంకో "ఢాం!" ఇంకో గంట గడిచింది. అన్నీశవాలే! వాటిమధ్యనించి ఒకభయంకరమైన ఆకారం మెల్లిగా మూలుగుతూ లేచికూర్చుంది. మొహమంతా మాంసంముద్ద. ఆముద్ద ఆవలించింది. పడిపోయింది శరీరం!

***

నాలుగువందల సంవత్సరాలు గడిచినై. ఒకగొల్లపిల్లవాడు ఆప్రాంత్యాలే ఒక దిబ్బమీద మురళివాయించుకుంటూ కూర్చున్నాడు. చుట్టూ దట్టనిఅరణ్యం; గోవులు [illegible] మేస్తున్నై. సూర్యుడు చెట్లసందుల్లోనించి నవ్వుతున్నాడు.

## కా వ లె ను.

ఈ దిగువ ప్రదేశములలో చిత్రగుప్త పత్రికలు అమ్ముటకు ఏజంట్లు కావాలి.

| | | |
|---|---|---|
| చామర్లకోట | పుత్తూరు | ఖరగ్ పురం |
| హైద్రాబాదు | కడప | ఆర్డా |
| నర్సరావుపేట | ప్రొద్దుటూరు | తిరుత్తని |
| నంద్యాల | తుని | పాకాల |
| కర్నూలు | సికింద్రాబాదు | మోల్మెక్ |
| జమ్ షెడ్ పురం | అంగలూరు | |
| వెంకటగిరి | బళ్ళారి | |

ఏజంట్లకు మంచి లాభముండగలదు. ఏజంటు నిబంధనలకును వివరములకును కార్యాలయమునకు వ్రాయండి.

మేనేజర్.
చిత్రగుప్త.
సావుకార్పేట, మదరాసు.

## ఒ క టే పా ఠ మా?




సర్ స్టాన్లీగారు (వెళ్లిపోయేముందు):—భారతమాతకు స్వరాజ్యం యియ్యవలసిందే. అది అవసరం.
భారతపుత్రుడు:—ఎంచక్కా వుంటుంది!

[ఇదివొక వోరవడిలావుంది! వచ్చే గవర్నర్లు వెళ్లే గవర్నర్లు, వైట్ పేపర్లు, జాయంటు పార్లమెంటరీకమిటీ రిపోర్టులు అన్నీ ఇండియాకు స్వరాజ్యం యియ్యవలసిందే అని అంగీకరిస్తవి. కాని యెప్పుడు? అనినదానికిమాత్రం సమాధానం రాదు. అంతా అదే అంటుంటే అందరికీ వొకే పాఠం నేర్పారా అన్న సందేహం కలుగుతుంది.]